

కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



కిష్టంపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం నెలకొన్న వర్షాల పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైసుమిల్లులకు తరలించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం చెన్నూరు మండలంలోని కిష్టంపేట, ఆస్నాద్, గంగారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. వర్షాల పరిస్థితుల కారణంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైసుమిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగు నీరు, నీడ ఓఆర్ఎస్ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్‌లను సమకూర్చామన్నారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన కొనుగోలు కేంద్రాలను మూసివేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు వారికి కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఉప తహసీల్దార్ సనత్, సంబంధిత అధికారులు, కేంద్రం నిర్వహకులు ఉన్నారు.

బీటెక్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(కాకతీయ యూనివర్శిటీ)లో ప్రవేశానికి సింగరేణి ఉద్యోగుల పిల్లలు దరఖాస్తు చేసుకోవాలని శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. మైనింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో రెండు చొప్పున మొత్తం పది సూపర్ న్యూమరీ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో తెలంగాణ ఏఈఏపీసెట్‌లో అర్హత సాధించి ఉండాలని, నిర్ణీత నమూనాలో దరఖాస్తును అన్ని సర్టిఫికెట్లతో జత చేసి వచ్చే నెల 14వ తేదీలోగా జీఎం(హెచ్ఆర్‌డీ)లో సమర్పించాలన్నారు. ఎంపికైన విద్యార్థుల ఏడాదికి రూ.70 వేలు ఫీజు రూపేణా చెల్లించాల్సి ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు.

సబ్సిడీపై జీలుగు విత్తనాలు

లక్షెట్టిపేట, మే 27(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతుల సౌకర్యార్థం వానాకాలం కోసం సబ్సిడీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆశాఖ అధికారి శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆదార్ కార్డు జిరాక్స్ కార్యాలయంలో అందజేసి విత్తనాలు పొందవచ్చునన్నారు. జీలుగు, జనుము విత్తనాలుకూడా అందుబాటులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

లక్షెట్టిపేట సీఐ బదిలీ



రమణమూర్తి

లక్షెట్టిపేట, మే 27(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేటసీఐ అల్లం నరేందర్‌ను బదిలీ చేస్తూ సోమవారం సాయంత్రం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఐజీ కార్యాలయంలో ఎ టాచ్‌గా ఉన్న డి.రమణమూర్తిని లక్షెట్టిపే ట సీఐగా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



మంచిర్యాలలో వృథాగా పడి ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు

తీరనున్న సొంతింటి కల

- జిల్లాకు మొదటి విడతలో 2150 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- జూన్ 2 నుంచి పంపిణీకి సిద్ధపడుతున్న ప్రభుత్వం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- గందరగోళంలో డబుల్ బెడ్రూం ఇళ్ల భవితవ్యం

మంచిర్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం త్వరలో పట్టాలెక్కనుంది. జూన్2న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లపంపిణీ చేయాలని ప్రభుత్వం భావి స్తుండగా, అందుకు జిల్లాలోనూ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. దీంతో సొంత ఇంటికోసం ఎదురుచూస్తున్న గూడులేని నిరుపేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో సొంతస్థలం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఆ విభాగంలోని వారికి మొదట లబ్ది చేకూరనుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్దపడుతోంది.

జిల్లాకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ..

మొదటి విడుతలో భాగంగా జిల్లాలోని మూడు నియోజక వర్గాలకు మొత్తంగా 2150 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలోని మూడు నియోజక వర్గాలతోపాటు జన్నారం మండలంలోని లబ్దిదారులకు వాటిని పంపిణీ చేయనున్నారు. జిల్లాకు మంజూరైన వాటిలో ఇప్పటి వరకు 914 ఇళ్ల నిర్మాణం ప్రారం భమైంది. వాటిలోనూ 179 ఇళ్లు బేస్మెంట్ లెవల్లో ఉం డగా, మూడు రూఫ్ లెవల్లో నిర్మాణం కొనసాగుతు న్నాయి. కాగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతోపాటు స్థలాల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,10,206 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

14వేల ఇళ్లు మంజూరుకు అవకాశం....

జిల్లాలో ఇళ్లు లేనివారి సంఖ్య వేలల్లోనే ఉంది. జిల్లాలో మొత్తం మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండలం కూడా జిల్లా పరిధిలోకే వస్తుంది. ఒక్కో నియోజ కవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటిం చారు. ఈ లెక్కన జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజక వర్గాలతోపాటు జన్నారం మండలానికి కలిపి మొత్తం సుమారు 14వేల ఇందిరమ్మఇళ్లు మంజూరు అయ్యే అవకాశాలు ఉన్నాయి. వాటికి తోడు రిజర్వుడ్ కోటా కింద మరికొన్ని ఇళ్లు కూడా ప్రభుత్వం మంజూరు చేయనుంది. రిజర్వ్ కోటా ఇళ్లు జిల్లా కలెక్టర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యేల ఆధీనంలో ఉంటాయి. అవసరాన్ని బట్టి అర్హులైన వారికి వాటిని అప్పటికప్పుడు మంజూరు చేసే వెసులుబాటు కల్పించారు.

ఎమ్మెల్యేలదే తుది నిర్ణయం....

ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక తుది నిర్ణయాన్ని ప్రభుత్వం ఎమ్మెల్యేలకే వదిలి పెట్టింది. ప్రతీ నియోజవర్గంలో ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే ప్రక్రియ మొత్తం ఉంటుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో ద్వితీయశ్రేణి నాయకులు తమకు అనుకూలంగా ఉండే వారికి ఇళ్లు కేటాయించేలా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకోవలసి ఉంటుంది. అర్హులైన వారు స్థానిక నాయకుల మద్దతు పొందాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వ హయాంలో డబుల్ ఇళ్ల మంజూరు బాధ్యత కలెక్టర్లకు అప్పగించింది. అయినా రాజకీయ ఒత్తిళ్లు పెరగడంతో పథకం నిర్వీర్యం అయింది. ప్రస్తుతం ఎమ్మెల్యేల చేతిలో ఆ ప్రక్రియ ఉండటం, గ్రామాలు, వార్డుల్లో స్థానిక నాయకుల హవా నడవనుండటంతో అర్హులకు ఇళ్లు అందుతాయా... ? అనే సందేహాలు కలుగుతున్నాయి.

రిజర్వేషన్ ప్రకారం..

ప్రజా పాలనలో మహిళల పేరుతో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండటంతోపాటు అందులో పేరు ఉన్న మహిళలకు ఇళ్లు మంజూరు చేయాలనే నిర్ణయానికి...

(తరువాయి 7లో)

ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న రాజు, దేవేందర్‌లు

నస్పూర్, మే 27 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శిగా నస్పూర్‌కు చెందిన డాక్టర్ రాజు అరుముల్ల, కొట్టె దేవేందర్‌లను నియమించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లా నుంచి పదవులు పొందినవారి పేర్లను తెలంగాణ ఒలంపిక్ అసోషియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి ప్రకటించారు. నూతనంగా పదవులు పొందిన రాజు అరుముల్ల, కొట్టె దేవేందర్‌కు నియామక పత్రాలను అందించారు. 2025-29 కాలానికి నాలుగేళ్ల పాటు బాధ్యతలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాజు, దేవేందర్‌లు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బాక్సింగ్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులను అసోషియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

భరోసా కేంద్రం ద్వారా బాధితులకు చెక్కుల పంపిణీ

డీసీపీ భాస్కర్

నస్పూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : బాధిత మహిళలు, పిల్లలకు భరోసా సెంటర్ ద్వారా సేవలందిస్తూ వారికి అండగా ఉంటామని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. నస్పూర్ పట్టణం సీసీసీ భరోసా కేంద్రంలో ఐదుగురు మహిళలకు ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ద్వారా వచ్చిన విక్టిమ్ అసిస్టెంట్ ఫండ్‌ను బాధితులకు మంగళవారం పంపిణీ చేశారు. ఇందులో రూ. పది వేల చొప్పున ఇద్దరికి వైద్యపరంగా, ఒకరికి చదువు కోసం రూ. ఐదు వేలు, మరో ఇద్దరికి వ్యాపారం కోసం పది వేల చొప్పున చెక్కులను డీసీపీ అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేష్, షీ టీమ్ ఎస్సై ఉమా రాణి, భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, మే27 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్లు 2024-25కు సంబంధించి సీఎంఆర్ డెలీవరి లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, అధికారులతో కలిసి సీఎంఆర్ డెలీవరి, రబీ దాన్యం వేలం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్ సంబంధిత సీఎం ఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలీవరి లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ ఏసీకే లక్ష్యాలను సైతం పూర్తి చేసి రబీకి సంబంధించి ధాన్యం ప్రక్రియను ప్రారంభించాలన్నారు. సకాలంలో ధాన్యం డెలీవరి పూర్తి చేయని పక్షంలో ధాన్యం దెబ్బతింటుందని అన్నారు. ఇందులో వారిగా పెండింగ్‌లో ఉన్న లక్ష్యాల వివరాలను తెలుసుకొని అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

2022-23 రబీకి సంబంధించి ధాన్యం వేలంలో వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో జమాచేయాలని లేని పక్షంలో తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫ రాలశాఖ అధికారి బ్రహ్మారావు, డీఎం శ్రీకళ, ఆర్ఐ. మురళీక్రిష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వందేభారత్ రైలు మంచిర్యాలలో ఆపాలని జీఎంకు వినతి



రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్, మే27(ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో వందేభారత్ రైలు నిలుపుదల చేయాలని కోరు తూ మంగళవారం రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, బీజేపీ నాయకులు రఘునాథ్‌వెరబెల్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికింద్రాబాద్- నాగ్ పూర్ మధ్య నడిచే వందేభారత్ రైలును మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలన్నారు. మంచిర్యాల రైల్వేస్టేషన్ ఎన్ఎస్ ఈ 3కేటగిరిలో ఉందని, ఏడాదికి 23కోట్ల రూపాయల ఆదాయం ఉందని, 13లక్షలుపైగా ప్రయాణికులు వెళ్తున్న ప్పటికీ వందేభారత్ రైలు నిలుపడం లేదని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముకేశ్‌గౌడ్, బెల్లంకొండ మురళీ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆటో జేఏసీ ప్రణాళిక రాష్ట్ర చైర్మన్ ముఖేశ్‌గౌడ్

మంచిర్యాలక్రైం, మే27 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల ఆకలికేక మహాసభ ఇందిరాపార్కు వద్ద జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఆటో జేఏసీ ప్రణాళిక చైర్మన్ ముకేశ్‌గౌడ్ అన్నారు. మంచిర్యాల పట్టణంలో జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహా లక్ష్మీ పథకం ఉచిత బస్సు వలన ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో అన్ని జిల్లా లను కలుపుకొని ఆటో కార్మికుల ఆకలికేక యాత్ర చేస్తామని ముగింపు సందర్భంగా మహా సభను హైదరాబా ద్‌లో పెద్ద ఎత్తున సభను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్మికులకు ప్రతినెల 12వేల రూపాయలు ప్రత్యేకంగా వెయ్యికోట్ల రూపాయలతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశా రు. సహజ మరణం చెందిన వారికి రూ.5లక్షలు చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసు కున్న ఆటో కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షలు ఇచ్చి ఆదుకోవాలని డి మాండ్ చేశారు. డిమాండ్లను నెర వేర్చని పక్షంలో భవిష్యత్ కార్యచ రణలో ఆమరణ నిరహార దీక్షకైన సి ద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు బెల్లంకొండ ము రళి, పొట్ట మధూకర్, నల్ల విక్రం, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

తెలుగుభాషా గొప్పతనాన్ని చాటిచెప్పాలి

మంచిర్యాలక్రైం, మే27(ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా గొప్పతనాన్ని చాటాల్సిన బాధ్యత తెలుగు ఉపాధ్యాయులందరిపై ఉందని రాష్ట్ర పరిశీలకులు ఓం ప్రకాశ్ అన్నారు. మంగళ వారం సాయికుంట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పద్య వైభవం అనే సెషన్‌పై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుభాషా గొప్పతనాన్ని, ప్రత్యేకతలు, తియ్యదనాన్ని ప్రతి ఒక తెలుగు ఉపాధ్యాయుడు తెలుసుకోవాలని ఆవిషయాలను విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు, సమాజానికి చేరాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. తెలుగుబాషలో వారు చేసిన ఎన్‌ఫీల్డ్ పరి శోధనలు, పీహెచ్‌డీ పరిశోధనలు వివిధ మేధావుల నుంచి పొందిన జ్ఞానాన్ని ఉపాధ్యాయులకు వివరించారు. ఈ కార్య క్రమంలో జిల్లా క్వాలిటి కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, సెంటర్ ఇన్‌చార్జి ఉపాధ్యాయులు వెంకటస్వామి, డీఆర్‌పీలు కొండు జనార్ధన్, నీరా దేవిలు పాల్గొన్నారు.

నెన్నెలలో భారీ వర్షం

- కొట్టుకుపోయిన ఎర్రవాగు తాత్కాలిక వంతెన



భారీ వర్షానికి కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

నెన్నెల, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళ వారం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లు తున్నాయి. మండల కేంద్రం సమీపంలోని ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహించడంతో తాత్కాలిక వంతెన కొట్టుకు పోయింది. బ్రిడ్జినిర్మాణ పనులు కొనసాగుతుండటంతో పక్క నుంచి తాత్కాలిక వంతెన నిర్మించారు. అది కాస్తా కొట్టుక పోవడంతో లంబాడితాండ, మన్నెగూడం, జంగాల్‌పేట, దమ్మిరెడ్డిపేట, కోనంపేట, కుర్మగూడం ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం బ్రిడ్జి పనులు ప్రారంభదశలోనే ఉన్నాయి. ఇప్పట్లో దాని నిర్మాణం పూర్తి కాదు. వర్షాకాలం మొత్తం పనికి వచ్చేలా పెద్ద పైపులు వేసి మట్టితో కాకుండా కంకర వేసి ప్రత్యమ్నాయం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే ఈ వానకాలం తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంటున్నారు.

నస్పూర్: నస్పూర్ పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం ఎండతో పాటు మబ్బు ఉండగా మధ్యాహ్నం 3గంటల సమయంలో మేఘాలు కమ్ముకుని ఒక్కసారిగా భారీ వర్షం మొదలైంది. గంట పాటు వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు నస్పూర్‌లో 20 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది.

జిల్లాలో మరో మూడు రోజులు వర్షాలు

నెన్నెల : జిల్లాలో మరో మూడు రోజుల పాటు భారి వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనకేంద్రం అధికారులు మంచిర్యాల జిల్లా కోసం ప్రత్యేక వాతావరణ బులెటిన్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈనెల 29, 30, 31వ తేదీల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురు గాలులతో (గంటకు 30నుంచి 40 కి.మీ.ల వేగంతో) కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కోతలు పూర్తి చేసుకుని కళ్లాల్లో ధాన్యం రాశులు ఉన్న రైతులు కవర్లు కప్పుకోవాలని, వీలైతే సురక్షిత ప్రాంతానికి ధాన్యాన్ని తరలిం చుకోవాలన్నారు. పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. రుతుపవనాలు 15 రోజుల ముందుగానే వచ్చాయని, ప్రస్తుతం రైతులు పచ్చిరొట్ట పైరు విత్తనాలు వేసుకో వచ్చని సూచించారు.

సర్వేయర్లు భూ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు ప్రతి అంశాన్ని పరిశీలించి భూ సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన లైసెన్స్‌డే సర్వేయర్ల శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే, ఎఫ్‌లైన్‌సర్వే వంటి వివిధ సందర్భాలు ఉంటాయన్నారు. సర్వే ప్రక్రియలో సర్వేయర్ల పాత్ర కీలకమైందని, గ్రామాలు, మండలాలు, అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ నేపథ్యంలో సర్వేయర్లకు అందించే శిక్షణ ఎంతో ముఖ్యమైనదని, ఈ శిక్షణలో ప్రతి అంశాన్ని నేర్చుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమానికి 162 మంది హాజరుకావాల్సి ఉండగా 153 మాత్రమే హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూ సర్వే రికార్డుల ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

హాజీపూర్, మే27 (ఆంధ్రజ్యోతి): ఈజీఎస్‌లో 2024-25 సంవత్సరంలో చేసిన పనులకు సంబంధించి నేటి నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ప్రత్యేక బృందం బుధవారం నుంచి ఆయా గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. మొత్తంగా 270 రకాల పనులను గుర్తించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సాయిలు, ఏపీవో మల్లయ్య, ఈసీలు, డీఆర్‌పీలు, వీఎస్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు పాల్గొన్నారు.

సింగరేణి సూపర్‌బజార్ మూసివేత

- ఇబ్బంది పడుతున్న కార్మిక కుటుంబాలు
- పట్టించుకోని అధికారులు



గోలేటిలో మూతబడ్డిన సింగరేణి సూపర్‌బజార్

రెబ్బెన, మే 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో పని చేసే ఉద్యోగులు, అధికారులకు నిత్యావసరాలు అందించేందుకు ఏర్పాటు చేసిన సూపర్ బజార్లు వరుసగా మూతపడుతున్నాయి. మండలంలోని గోలేటిలో సింగరేణి కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సూపర్‌బజార్ మూతపడింది. సింగరేణి సంస్థలో పని చేసే కార్మికులకు నాణ్యమైన సరుకులు బయటి మార్కెట్ కంటే తక్కువ ధరకే అందించేందుకు సూపర్ బజార్‌ను ఏర్పాటు చేసింది. కార్మిక కుటుంబాల అవసరాలకు అనుగుణంగా సరుకులు అందించడంతో ప్రారంభంలో సూపర్ బజార్లు విజయవంతంగా నడిచాయి. కాలక్రమంలో ఆసక్తి సన్నగిల్లడం, అవసరాకు తగినట్టు సరుకులు అందుబాటులో లేక పోవడంతో అవి లక్ష్యానికి దూరమయ్యాయి.

తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు..

సింగరుణి కార్మికులు, ఉద్యోగులకు కావల్సిన నిత్యా వసర సరుకులు తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశంతో యాజమాన్యం 1974లో కోఆపరేటివ్ సొసైటీ కింద సూపర్‌బజార్లను ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్ షిప్‌లో ఏర్పాటైంది. నిత్యావసరాలతో పాటు కాస్మోటిక్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు, దుస్తులతో పాటు ప్రతీ వస్తువు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసింది. కానీ అనంతరం నెలకొన్న పరిస్థితుల్లో సూపర్‌బజార్లు క్రమంగా మూతపడుతున్నాయి. కార్మిక కుటుంబాలు బయట మార్కెట్‌లో అధిక ధరలకు సరుకులు కొనుగోలు చేయాల్సిన నెలకొంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా స్మార్ట్ ఫోన్ యుగం నడుస్తుండడం, ఈ కామర్స్ సేవలు విస్తరిచండంతో ఇంట్లోనే ఉండి ఆర్డర్ చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సింగరేణి సంస్థ సూపర్ బజార్లను పరిస్థితులకు అనుగుణంగా అప్ డేట్ చేయలేక పోయింది. ఫలితంగా సూపర్ బజార్లకు వచ్చే కార్మిక కుటుంబాల సంఖ్య తగ్గింది. ఆదరణ తగ్గి పోవడంతో సకాలంలో సరుకులు తెప్పించక పోవడంతో బయటి మార్కెట్‌కు వెళ్లేందుకు మొగ్గుచూపారు. కార్మిక కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉంచి తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు అందించేలా ఏర్పాట్లు చేస్తే తిరిగి పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది.

సింగరేణి సూపర్ బజార్‌లో కార్మికులు క్రెడిట్‌పై నిత్యవసర సరుకులు తీసుకెళ్లే అవకాశాన్ని యాజ మాన్యం కల్పించింది. నెలాఖరు సమయంలో కుటుంబాలు నిత్యవసరాలు తెచ్చుకునే వెసులుబాటుతో కొంత మేర ఇబ్బందులు తగ్గేవి. క్రెడిట్‌పై తీసుకున్న సరుకులకు సంబంధించిన నగదును కార్మికుడి వేతనం నుంచి కట్ చేసే వారు. చేతిలో చిల్లిగవ్వ లేక పోయినా కుటుంబానికి సరుకులు లభిస్తాయనే ధీమా ఉండేది. సూపర్‌బజార్ మూత పడటంతో నెలాఖరు సమయంలో కార్మిక కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యవసరాతో పాటు ఎలక్ట్రికల్ వస్తువులను సైతం సూపర్‌బజార్ ద్వారా అందించే వారు. యాజమాన్యం వీటిని పట్టించుకోక పోవటం, అందుబాటులో సరుకులు ఉంచక పోవడంతో సిబ్బంది అవినీతికి పాల్పడడం వంటి కారణాలతో సూపర్ బజార్లు మూతబడ్డాయి.

తిరిగి ప్రారంభించాలి..: పి రాజబాబు, హెచ్ఎంఎస్ నాయకుడు



గోలేటిలో సింగరేణి సూపర్‌బజార్‌ను తిరిగి ప్రారంభించటం ఎంతో అవసరం ఉంది. నాణ్యమైన సరుకులు కావాలంటే బెల్లంపల్లి, మంచిర్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.. సూపర్ బజార్ మూసివేయటంతో కిరాణా షాపుల్లో సరుకులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు వెంటనే స్పందించి సూపర్‌బజార్‌ను వెంటనే తెరిపిస్తే బాగుంటుంది. ఈ విషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

కార్మికులకు ఇబ్బందికరమే.. బోగ ఉపేందర్, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు



కార్మికులకు ఎంతో ఉపయోగంగా ఉండే సూపర్ బజార్ మూసివేతకు గురి కావడం ఇబ్బందికరమైన విషయం. సూపర్ బజార్‌ను తెరువాలని సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లటం జరిగింది. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని యాజమాన్యం సూపర్ బజార్‌ను తెరువాలి. అందరికి ఉపయోగకరంగా ఉంటుంది. సరుకుల కోసం కార్మికులంతా కిరాణ కొట్టులను నుంచి తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఉంది.

తక్కువ ధరకు సరుకులు.. రాజేష్ కాంట్రాక్టు, కార్మికుడు



సూపర్‌బజార్‌ను తిరిగి ప్రారంభిస్తే సరుకులు తక్కువ ధరకు దొరుకుతాయి. కార్మికులందరికీ అందుబాటులో ఉండే విధంగా ఉంటుంది. యాజమాన్యం వెంటనే పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి. కార్మికులకు క్రెడిట్ ఇచ్చే అవకాశం ఉండడంతో నెలాఖరు సరుకులు కొనుగోలుకు సైతం ఉపయోగకరంగా ఉంటుంది. యాజమాన్యం చర్యలు తీసుకోవాలి.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు, దీపక్ తివారి, డేవిడ్, సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని, అన్ని జిల్లాల కలెక్టర్లు తమ జిల్లా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనుల పురోగతిపై పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంగళవారం రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర రెవెన్యూ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్ర పొన్నం ప్రభా కర్, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క), రాష్ట్ర భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ప్రజారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో వరి ధాన్యం కొనుగోలు, వ్యవసాయం, భూభారతి, ఇందిరమ్మ ఇళ్ల అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌లు అధికారుల సమన్వయంతో జిల్లాలోని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను అర్హులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తుందన్నారు. వరి ధాన్యం సేకరణ గతంతో పోల్చితే ఈ సారి అధికంగా జరిగిందని అన్నారు. ఇప్పటి వరకు 64 లక్షల50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించి 12 వేల 154 కోట్ల రూపాయల 10.55 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఈ సారి 15 రోజుల ముందు రుతు పవనాలు ముందుకు రావడంతో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మీడియాలో వచ్చే ప్రతి కూల వార్తలపై స్పందించాలని చెప్పారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని సూచించారు. రుతుపవనాల ముందస్తు రాకతో తదనుగుణంగా విత్తనాలు, ఎరువులు సమకూర్చడం, పంట సాగు అంశాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయం, తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవా లన్నారు. భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం 2025లో భాగంగా ముందుగా రాష్ట్రంలోని నాలుగు జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేయడం జరిగిందని, మిగిలిన జిల్లాలో జిల్లాకు ఒక మండలం చొప్పున ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. భూ సమస్యల సంబంధిత దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. జూన్ 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు అందే విధంగా పర్యవేక్షించాలని చెప్పారు. ఈ నెల 28, 30 తేదీల్లో ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు వారి జిల్లాలో పర్యటించి పనుల పురోగతి పరిశీలించాలన్నారు. జూన్ 1వ తేదీ నాటికి పూర్తి నివేదిక అందజేయాలని చెప్పారు. జూన్2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేసి అందించాలని తెలిపారు. ప్రస్తుతం కోవిడ్ వైరస్ వ్యాపిస్తున్న దృష్ట్యా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, వ్యవసా యం, భూభారతి, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లక్ష్యాలను సమన్వయంతో పూర్తి స్థాయిలో సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీపీవో భిక్షపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధకారి దత్తారావు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పీడీ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్/చింతలమానేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. ఆసిఫాబాద్, పెంచికలపేట, దహెగాం, సిర్పూర్(టి), కాగజ్‌నగర్, కౌటాల, కెరమెరి, చింతలమానేపల్లి మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఈ ఏడాది రుతుపవనాలు ముందస్తుగానే వస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. దుక్కులు దున్నుకోవడం, విత్తనాలు కొనుగోలు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

భక్తుల ప్రత్యేక పూజలు


శనీశ్వరుడికి తైలాభిషేకం చేస్తున్న భక్తులు

రెబ్బెన, మే 27 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన ఇందిరానగర్‌లో కనకదుర్గాదేవి మహంకాళి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనీశ్వరుడికి తైలాభిషేకం, ప్రసాదాలను సమర్పించారు. జిల్లాలో శనీశ్వర స్వామి ఏకైక ఆలయం ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

ఎంహెచ్‌డీ మండల అధ్యక్షుడిగా లింగంపల్లి రాజు

నెన్నెల, మే 27 (ఆంధ్రజ్యోతి) : మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఆకునూరి రాజ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు కల్లెపల్లి నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం నెన్నెలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నందిపేట ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా లేతకారి గణేష్, అధికార ప్రతి నిధిగా తోటపల్లి నగేష్, కార్యదర్శులుగా లింగంపెల్లి శ్రీను, విష్ణు, తోటపల్లి బన్నిలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారు సంఘం అభివృద్ధికి, హక్కుల కోసం పోరాటం చేయాలని జిల్లా నాయకులు కోరారు. మండల ఇన్‌చార్జి ఇదిగిరాల ప్రసాద్, చేరికల ఇన్‌చార్జి గోగర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పట్టాభిషేకం

నెన్నెల, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కాపువాడలో ఐదు రోజులుగా ప్రదర్శిస్తున్న చిరుతల రామాయణం మంగళవారం ముగిసింది. దశల వారిగా ఐదు రోజుల్లో ఏడు కాండాలను పూర్తి చేయగా, పట్టాభిషేకంతో కథ సంపూర్ణమైందని నిర్వాహకులు తెలిపారు. వైభవంగా నిర్వహించిన సీతా రాముల పట్టభిషేకంలో పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాత్రధారులకు హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

చిలుక ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలక్రైం, మే27(ఆంధ్రజ్యోతి): మహ్మద్‌ప్రవక్తపై కించపరిచే వ్యాఖ్యలు చేసిన చిలుక ప్రవీణ్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలని ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షాకీర్, మహ్మద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావుకు ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్, అఫాన్, సమీర్, మీనాజ్, హబీబ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు

హెచ్‌సీఏ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న 13వ బెటాలియన్ కమాండెంట్ రాములు

హాజీపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న క్రికెట్ పోటీలను మంగళవారం 13వ బెటాలియన్ కమాండెంట్‌రాములు గుడిపేటలో ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరుటీంలుగా విభజించి ఒక్కో టీం ఐదు మ్యాచ్‌లు ఆడనున్నట్లు హెచ్‌సీ ఏ జిల్లా ప్రెసిడెంట్ ప్రదీప్ తెలిపారు. ఈ మ్యాచ్‌లు మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 3 వేదికల్లో నిర్వహిస్తున్నారు. గుడిపేట 13వ బెటాలియన్, మందమర్రి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్, మంచిర్యాల ఉషోదయ స్కూల్ గ్రౌండ్‌లలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ప్రదీప్, కోచ్‌లు క్రీడాకారులు పాల్గొన్నారు.

భూమిలో పోషకాలను కాపాడాలి

మందమర్రిరూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులు భూమిలో పోషకాలను కాపాడుతూ ముందుకు సాగాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం సారంగపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగుల మందులు కొన్న తర్వాత సంబంధిత డీలర్ వద్ద కొన్న వాటికి రశీదులు తీసుకుని భద్ర పర్చుకోవాలని చెప్పారు. పంటలు నష్టపోతే పరిహారం పొందే వీలుంటుందన్నారు. సాగునీటిని ఆదా చేయాలని , రాబోయే తరాలకు నీటిని అందించేందుకు నీటిని పొదుపుగా వాడాలన్నారు. పంట మార్పిడి చేయడం వల్ల లాభాలుంటాయన్నారు. సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పచ్చి రొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పెసరను వేసుకోవాలని చెప్పారు.. రైతు ప్రతీ సారి వరి , పత్తి పంటలను కాకుండా రైతులు కంది, పెసర, మిను ము పంటలపై దృష్టి సారించాలన్నారు. ఆయిల్‌పామ్ పంటల సాగు ద్వారా లాభాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్, ఆయిల్‌పామ్ ప్రతినిధి ఉద య్‌కుమార్ , శాస్త్రవేత్తలు ప్రియసుగంధి, తిరుపతి, మండల వ్యవసాయాధికారి కిరణ్మయి, ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి, ఏఈవోలు తిరుపతి, కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

కూలీలకు బ్యాంకు సేవలపై అవగాహన సదస్సు

జన్నారం, మే27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల్లపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం దండేపల్లి (సీఎఫ్ఎల్) ఆధ్వర్యంలో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కూలీలకు బ్యాంక్ సేవలపై అవగాహ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పైడిపల్లి ఫా రెస్టులో దండేపల్లి కౌన్సిలర్ వేల్పుల రవీందర్ మాట్లాడుతూ ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్ కేటాయింపులు, డిజిటల్ ఖాతాలు, రుణ సౌకర్యాలతో కూడిన అదన పు ప్రయోజనాలు, పెన్షన్ ఉత్పత్తులపై వివరించారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్స్ గుడికందుల హరీశ్, మేసు నూతన్‌కుమార్, ఎఫ్ఏ రాజేందర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు వృత్తినైపుణ్య శిక్షణ

బెల్లంపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసించిన నిరుద్యోగులుగా ఉన్న పూర్వ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని గురుకుల బాలుర పాఠ శాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. గురుకుల పాఠశాలలో, కళాశాలలో 2017 నుంచి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువులు అభ్య సించలేని పరిస్థితిలో ఉన్న ని రుద్యోగులకు వివిధ రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 25 ఏళ్ల లోపు వయస్సుగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి రోజు మూడు గంటల పాటు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు.

పోడు రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలి

కోటపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : పోడు రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం మండలంలోని సిర్సా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముందు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బ్యాంకు మేనేజర్ రంజిత్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎర్మ పున్నం మాట్లాడుతూ సిర్సా గ్రామీణ బ్యాంకు అధికారులు ఆదివాసీలను బ్యాంకు చుట్టూ తిప్పించుకుని చివరకు పోడు రైతులకు రుణం ఇవ్వమని తేల్చి చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోడు పట్టాలు కలిగిన ఆదివాసీలందరికి రుణాలను అందించాలని ప్రభుత్వం ఓ వైపు చెబు తున్నా ఇక్కడి యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అధికారులు వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనట్ల యితే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుమలత, నాయకులు శ్రావణ్, తలండి ముత్తయ్య, చిన్నన్న, లచ్చయ్య. సమ్మయ్య, సంపత్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


ప్రమాదకరంగా ఉన్న స్తంభం

దండేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): దండేపల్లిలో మసీదు రోడ్డు వేళ్లే రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఏడాది క్రితం ఈదురు గాలులు వీచినప్పుడు విద్యుత్ స్తంభం పై భాగంలో విరిగి ప్రమాదకరంగా మారింది.. అసలే ఇప్పుడు ఈదులు గాలులు వీస్తుండంతో ఏ ప్రమాదం జరక ముందు అధికారులు స్పందించి కొత్త స్తంభం ఏర్పాటు చేసేందురకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పరిశీలించి.. సూచనలు చేసి..


యాష్ సైలోను పరిశీలిస్తున్న జీఎం మనోహర్, అధికారులు

జైపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని బాటమ్ యాష్ సైలోను, యాష్ పాండ్‌ను మంగళవారం సింగరేణి జీఎం (కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) ఎ.మనోహర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాటమ్ యాష్ ఉత్పత్తి దాని నిర్వహణ , యాష్ పాండ్ సామర్థ్యం వివరాలను అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ఎస్టీపీపీ అధికారులు, శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బాటమ్ యాష్ వివరాలను ఒకరికి ఒకరు పంచుకోవాలని సూచించారు. అనంతరం మొదటి సారిగా ఎస్టీపీపీకి వచ్చిన జీఎం మనోహర్‌ను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాస్, ఆర్కే 7 ఏజెంట్ రాజేందర్, డీజీ ఎం లక్ష్మణ్, డీజీఎం సివిల్ ఆజాదుల్లాఖాన్, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారం, డీజీఎం ఎన్విరానమెంట్ వాసుదేవమూర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షం నీరు క్వారీలోకి రాకుండా చూడాలి

జైపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వర్షం నీరు క్వారీలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సేఫ్టీ కార్పొరేట్ జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ ఓసీపీ గనిని మంగళవారం సందర్శించారు. క్వారీలోని పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సంవత్సరం నిర్దేశించిన ఓబీ, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాదనకు చేపట్టాల్సిన ప్రణాళికలపై దిశ నిర్దేశం చేశారు. రక్షణే ప్రథమం రక్షణే ఎల్లప్పుడు రక్షణే చివరి వరకు అనే నినాదంతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించినప్పుడు సంస్థ అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగులు, అధికారులు తప్పనిసరిగా రక్షణను మరువవద్దని సూచించారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగంగా అనేక అధునాతన సాంకేతికను తీసుకువచ్చిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఉద్యోగి, అధికారి నిర్దేశించిన విధులను, ఉద్యోగులు వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరిస్తూ ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దేందుకు ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ అధికారి రఘుకుమార్, ఇందారం ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, గని ఆపరేషన్స్ మేనేజర్ శంకర్, ప్రాజెక్టు ఇంజనీర్ రామకృష్ణరావు, రక్షణాధికారి సతీష్, సర్వే అధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

దండేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ వ్యవసాయ పంట పొలాల చుట్టూ అటవీ జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని దండేపల్లి ఎస్సై తహసీనుద్దీన్ హెచ్చరించారు. దండేపల్లి పోలీసుస్టేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరైనా పొలాల చుట్టూ అటవీ జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చితే వారిపై శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ముందస్తు పాఠ్య పుస్తకాలు పంపిణీ

దండేపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి విద్యార్థులకు ఉచితంగా వచ్చిన పాఠ్య పుస్తకాలను మంగళవారం దండేపల్లిలో విద్యవనరుల కేంద్రంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఎంఈవో దుర్గం చిన్నయ్య ఆదేశాల మేరకు ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో విద్య వనరుల కేంద్రం ఎంఐఎస్ నగేష్, సీసీవో మల్లేష్, సీఆర్‌పిలు సర్పయ్య, సురేందర్, రమేష్, కార్యాలయ సిబ్బంది మల్లేష్, హెచ్‌ఎంలు, పాల్గొన్నారు.

పంటలను ముందుగానే సాగు చేయాలి

భీమారం, మే 27 (ఆంధ్రజ్యోతి) : వరి, పత్తి వంటి పంటలను ముందుగానే సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కల్పన పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పోతనపల్లి గ్రామంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. పంట అవశేషాలను తగులబెట్టకుండా భూమిలో కలియదున్నితే భూమి సారవంతంగా అవుతుందన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రసాద్, మండల వ్యవసాయాధికారి అత్తె సుధాకర్, ఏఈవో అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వాహనంపై నుంచి పడి గాయాలు

బెల్లంపల్లి, మే27 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలానికి చెందిన నరేశ్ మంగళవారం బెల్లంపల్లి రైల్వేస్టేషన్ సమీపం వద్ద పంది అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. దీంతో తలకు, చేతులకు తీవ్రగాయా లయ్యాయి. గమనించిన స్థానికులు గాయాలపాలైన నరేశ్‌ను ఆసుపత్రికి తరలించారు.



ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు...

కరెంటు తీగలు తెగిపడినప్పుడు కనీస అవగాహన లేకుండా తీగలను తాకరాదు. వ్యవసాయ పంపుసెట్లు వినియోగించినప్పుడు కరెంటు మోటార్ల ఫుట్‌బాల్‌లు, గ్రీస్‌వైర్లు, సర్వీసు వైర్లు ఇన్సులేషన్ సరిగ్గా తీసుకోవాలి. వీటి విషయంలో ఏమరుపాటు వద్దు. ఇండ్లలో జీఐ వైర్లను బట్టలు ఆరేసుకునేందుకు దండాలుగా వాడకూడదు. దీనికి విద్యుత్‌సరఫరా ఎక్కువగా ఉంటుంది. సెల్‌ఫోన్ చార్జింగ్‌పెట్టి మాట్లాడడం ప్రమాదకరం. ఎలక్రికల్, వాటర్‌హీటర్, బ్లీజర్‌లను, స్విచ్‌లను తడిచేతులతో తాకరాదు. నాణ్యమైన ఐఎస్ఐ ట్రేడ్‌మార్క్ పొందిన విద్యుత్ పరికరాలు మాత్రమే వినియోగించాలి.

మృత్యు తీగలు..

- విద్యుదాఘాతంతో మృత్యువాత పడుతున్న ప్రజలు, మూగజీవాలు
- కిందకి వేలాడే విద్యుత్ తీగలు... ఒరిగిన స్తంభాలతో ప్రమాదాలు
- యేటా పెరుగుతున్న మృతుల సంఖ్య
- వారం రోజుల్లో 25 పశువులు బలి

కాసిపేట/నెన్నెల, మే 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ఆ రంభంలో విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉంటాయి. మే, జూన్ నెలలో వీచే బలమైన ఈదురు గాలులకు కరెంటు తీగలు తెగిపడడం, కరెంటు పోల్స్ విరిగిపడడంతో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. అలాగే ఎండ వేడికి ఇన్సులేటర్‌లు వేడెక్కి ఉంటాయి. వర్షాకాలం ఆరంభంలో వర్షం నీటి చుక్క ఇన్స్ లేటర్ పై పడగానే అవి పగిలిపోతాయి. రెండు తీగలు స్తంభాలపై వాలి కరెంటు పోల్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. లేదా కరెంటు పోల్‌కు ఉన్న స్టేవైర్‌నీటిలో లేదా భూమిలో కూరుకపోయి ఉండడంతో ఎర్త్ సరఫరా అయి మనుషులు, మూగజీవాలు తగిలి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి అప్రమత్తతోనే విద్యుత్ ప్రమాదాలను నివారించుకోవచ్చునని విద్యుత్‌శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, పట్టణ వాసులు కరెంటుతో నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యుత్ ప్రమాదాలకు గుర వుతున్నారు. ఏటా జిల్లాలో సగటున 500 మంది మనుషులు, వెయ్యికి పైగా మూగ జీవాలు కరెంటు షాక్‌తో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రమాద బాధితులకు నష్టపరిహారం...

విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించి కొంత నష్టపరిహారం అందజేస్తుంది. కుటుంబ పెద్దలు కోల్పోయిన లోటును ఎవరు భర్తీ చేయలేరు. ఒక వేళ మనుషులు విద్యుత్ ప్రమాదాలతో మృతి చెందితే ఐదు లక్షలు, గేదెలు మృతి చెందితే ఒక గేదెకు రూ.40 వేల చొప్పున అందజేస్తారు. సంబంధిత పత్రాలను స్థానిక విద్యుత్ శాఖ ఏఈలకు అందజేయాలని అధికారులు తెలియజేస్తున్నారు.

పరిహారం అందడంలో జాప్యం

మూగజీవాలు విద్యుదాఘాతానికి గురై మరణిస్తే విద్యుత్ సంస్థ నష్టపరి హారం చెల్లించాల్సి ఉంటుంది. కానీ నెలలు గడుస్తున్న చాలా మందికి పరిహారం అందడం లేదు. నిబంధనల ప్రకారం విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన కాడెద్దు, కోడెలు, పాలిచ్చే గేదెలకు రూ. 40 వేల వరకు, మేకలు, గొర్రెలకు రూ. 7 వేల చొప్పున పరిహారాన్ని చెల్లించాల్సి ఉంటుంది. పోస్టుమార్టం రిపోర్టు, క్షేత్రస్థాయి విచారణ, నివేదికల పేరిట కాలయాపన చేస్తారనే ఆరోపణలున్నాయి. జరిగిన నష్టంలో 50 శాతం మాత్రమే అందజేసి చేతులు దులిపేసుకుంటున్నారు. ఆవులు, బర్రెల విలువ రూ. 50 వేల నుంచి 80 వేలు, కాడెద్ల విలువ రూ. 70 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఉండగా అందులో 50 శాతం కూడా ఇవ్వడం లేదని బాధిత రైతులు పేర్కొంటున్నారు. నష్టపోయిన పశువుల మార్కెట్ విలువ ఆధారంగా పూర్తి స్థాయి పరిహారం వచ్చేలా చూడాలని బాధితులు విజ్ఞప్తిచేస్తున్నారు. పాత లైన్లకు కొత్త తీగలు వేయడం, వేలాడతున్న చోట స్తంభాలు ఏర్పాటు చేయడం, రక్షణ లేని ట్రాన్స్ ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాం...

ఎస్ఈ గంగాధర్, విద్యుత్‌శాఖ మంచిర్యాల



విద్యుత్ ప్రమాదాలపై గ్రామాల్లో, పట్టణాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాం. రైతులు పంట పొలాల సంరక్షణ కోసం దొంగచాటుగా కరెంటు తీగలను కంచేగా వాడుతున్నారు. దీని వల్లనే కరెంటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యుత్ చౌర్యం నేరమని తెలిసిన అందరూ యథేచ్ఛగా వాడుతున్నారు. చట్టం నిందితులను కఠినంగా శిక్షించినప్పుడే విద్యుత్ చౌర్యాన్ని నిరోధించవచ్చు. విద్యుత్ సర ఫరాలో లేదా విద్యుత్ పోల్స్ విరిగిపడి, విద్యుత్‌వైర్లు తెగిపడిన 1912టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందివ్వాలి. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉన్నత అధికారుల పర్యవేక్షణ ఉంటుంది.



యేటా పెరుగుతున్న మృతుల సంఖ్య

తప్పిదం ఎవరిదైన విద్యుత్ ప్రమాదాల బారిన పడుతున్న వారి సంఖ్య యేటా పెరుగుతోంది. గ త ఏడాది 530 మంది కరెంటుషాక్‌తో చనిపోగా 971 మూగజీవాలు మృత్యువాతకు గురయ్యారు. ఈ ఘటనలు మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ ఏడాది కూడా ఎక్కువ సంఖ్యలో మనుషులు, మూగ జీవాలు మృతి చెందాయి. జిల్లాలో గడిచిన వారం రోజుల్లోనే 25 పశువులు కరెంటు తీగలకు బలయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. వీటిలో విద్యుత్‌శాఖ అధికారుల నిర్ల క్ష్యానికి గురైన ఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నా యి. కరెంటు నిత్యావసర వస్తువుల్లో భాగమైంది దీంతో విద్యుత్ వినియోగం సైతం ప్రజలు అవస రానికి మించి వినియోగిస్తున్నారు.

ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే విద్యుత్ ప్రమాదాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీరనున్న సొంతింటి కల

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం వచ్చింది. వివిధ వర్గాలకు రిజర్వేషన్ దామాషాన ఇళ్ల మంజూరు జరుగనుంది. దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ మైనార్టీలకు 50 శాతం, జనరల్ కోటాలో 15 శాతం ఇళ్లు కేటాయించనున్నారు. గతంలో ఇళ్లు మంజూరైనా, దళితబంధు పథకం పొందిన దరఖాస్తులను తిరస్కరిస్తారు. అలాగే శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు సంబంధించి ఇంటి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు చూపాల్సి ఉంటుంది. సొంత స్థలం కనీసం ఒక గుంట పట్టా కలిగి ఉండాలి. మంజూరు పత్రాలు అందిన తరువాత ఇళ్ల నిర్మాణం ప్రారంభించుకో వచ్చు. బేస్‌మెంట్ నుంచి ఇల్లు పూర్తయ్యే వరకు వివిధ దశల్లో నగదు చెల్లించనున్నారు.

డబుల్ ఇళ్ల పరిస్థితి ఏమిటో....?

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం అర్థాంతరంగా ముగిసింది. పథకంలో భాగంగా జిల్లాకు మొత్తం 2616 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో మంచిర్యాల నియోజకవర్గానికి 650 ఇండ్లు మంజూరు కాగా మొత్తం ఇళ్లను జిల్లా కేంద్రానికి కేటాయించారు. వీటిలో ఇప్పటి వరకు 360 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా రెండు విడుత లుగా లబ్దిదారులకు లక్కీ డ్రా ద్వారా పంపిణీ చేశారు. చెన్నూరు నియోజకవర్గానికి 1146 మంజూరుకాగా, వాటిలో మందమర్రిలో 560, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి 286, చెన్నూరుకు 300 ఇండ్లు కేటాయించారు. వాటిలో 194 ఇళ్లు మినహా, మిగతా వాటి నిర్మాణం దాదాపుగా పూర్తయింది. అయినప్పటికీ చెన్నూరులో లబ్దిదారుల ఎంపిక చేపట్టనేలేదు. అలాగే బెల్లంపల్లి నియోజకవర్గానికి 425 ఇళ్లు మంజూరు కాగా, పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇదిలా ఉండగా, ఇళ్ల నిర్మాణం పూర్తయిన చోట్లలో కూడా పంపిణీకి నోచుకో లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ఇందిరమ్మ ఇళ్లపై దృష్టిసారించింది. డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రస్తావన ప్రభుత్వంగానీ, అధికారులుగానీ తీయడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పరిస్థితి ఏమిటన్నది ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది.

న్యూజెర్సీలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్న మాజీ ఎమ్మెల్యేలు



న్యూజెర్సీలో కేక్ కట్ చేస్తున్న బాల్క సుమన్, ఇతర మాజీ ఎమ్మెల్యేలు

మంచిర్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని డల్లాస్‌లో జూన్ 1న నిర్వహించతలపెట్టిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సంబంధించి మంగళ వారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. అమెరికాలోని న్యూజెర్సీలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పార్టీ మాజీ ఎమ్మెల్యేలు డా. గాదరి కిశోర్ క్రాంతికిరణ్‌తోపాటు సీనియర్ నాయకుడు గ్యాదరి బాల మల్లు, పాల్గొని కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డల్లాస్‌లో నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలపై చర్చించారు. సన్నాహక సమావేశం దృశ్యాలను బాల్క సుమన్ అమెరికా నుంచి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నిరసన



కొండాపూర్ యాప వద్ద రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాసిపేట, మే27(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా సోమగూడెంలోని దేవాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి కొండాపూర్ యాప వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరుతూ మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య మాట్లాడుతూ కొంతకాలంగా కొండాపూర్ యాప వద్ద రోడ్డు వర్షం నీరు నిలిచి గుంతలమయంగా మారిందన్నారు. దీంతో ప్రయాణికులు ప్రతి రోజు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. దీని విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిని ఎవరు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, మంజులారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

కాసిపేట, మే27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఆటోడ్రైవర్లు తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగానే బీఆర్ఎస్ నాయకులను మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. కాసిపేట పోలీసులు సోమగూడెం ఆటోడ్రైవర్లతో పాటు బీఆర్ఎస్ ముత్యంపల్లి మాజీ సర్పంచ్ ఆడె బాదు, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి యాదవ్, సోమగూడెం మాజీ సర్పంచ్ ప్రమీలగౌడ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

హాజీపూర్: పెండింగ్ బిల్లులను చెల్లించాలంటూ డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి పిలుపునిచ్చన నేపథ్యంలో హాజీపూర్ మండలంలోని బీఆర్ఎస్ సర్పంచ్‌లు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో మాజీ సర్పంచ్‌లు గోళ్ల శ్రీనివాస్, ఆనే మల్లేశ్, జాడి సత్యం, బేర పోచన్న, మట్టపల్లి సత్యనారాయణరావులు ఉన్నారు.

చెన్నైసెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌కు మంచిర్యాల స్టేషన్‌లో అదనపు స్టాప్

హైదరాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భగత్‌కీ కోఠి ఎక్స్‌ప్రెస్ ఇక నుంచి వచ్చి వెళ్లేప్పుడు మంచిర్యాల స్టేషన్‌లో ఒక నిమిషం పాటు ఆగుతుంది. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(06157) నుంచి వచ్చే రైలు మే 28వ తేదీ నుంచి గం. 6.14ల నుంచి 6.15 వరకు, భగత్‌కీ కోఠి (06158) నుంచి వచ్చే రైలు మే 31 తేదీ నుంచి 10.34ల నుంచి 10.35ల వరకు ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఊర చెరువుకు కొత్త తూము నిర్మించాలి

మందమర్రిరూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిగట్టులోని ఊర చెరువుకు కొత్త తూమును నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. 20 ఏండ్ల క్రితం నిర్మించిన పాత తూము గత సంవత్సరం తూము కూలిపోవడంతో చెరువు కింద ఆయకట్టు భూములకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు చెరువు కింద ఆయకట్టు సాగు భూములు ఉన్నాయి. తూము కూలిపోవడంతో భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కొత్త తూము నిర్మించి భూములకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ప్రజావాణిలో అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి, మే27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళా శాల క్రీడామైదానంలో ఈనెల 25న జరిగిన జిల్లాస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లి విద్యార్థులు రాణించారు. రాణించిన విద్యార్థులను మంగళవారం పట్టణంలోని తిలక్‌మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. అనంతరం కోచ్ సంతోష్‌ను సన్మానించారు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వివిధ కేటగిరీల్లో 25 మంది విద్యార్థులు విజయం సాధించి పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కన్వీనర్ నాతరి స్వామి, క్రీడాగ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రాజన్న, నాగేశ, జయ రాం యాదవ్, రాచర్ల సంతోష్, పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ దుకాణాల తనిఖీ

వేమనపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్లపల్లి, వేమనపల్లి గ్రామాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాలను మంగళవారం వ్యవసాయ సహాయ సంచాలకులు సురేఖ తనిఖీ చేశారు. రిజిష్టర్‌లు, స్టాకు నిల్వలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలన్నారు. అనంతరం నీల్వాయి రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు.

వైద్య సిబ్బందికి యోగాపై అవగాహన

నస్పూర్, మే 27 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం నస్పూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఆయూష్ ఆధ్వర్యంలో యోగాపై వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయూష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజా, యోగా శిక్షకులు సుధాకర్, మేఘన, ఫార్మసిస్టు పుష్పాంజలి, ఎస్‌సీఎస్ కిషన్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గోవధ కేంద్రాలను మూసివేయాలి

జన్నారం, మే27(ఆంధ్రజ్యోతి): జన్నారం మండలంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న గోవధ కేంద్రాలను పూర్తి స్థాయిలో మూసి వేయాలని కోరుతూ హిందూ వాహిని నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని పొన్కల్‌లోని గాంధీనగర్, జన్నారంలోని రాంనగర్, జన్నారంలో ఎన్‌టీఆర్ నగర్ వ ద్ద, పెద్ద మసీదు పరిసరాల్లో, కవ్వాల్ గ్రామాల్లో అక్రమంగా గోవులను వధిస్తున్న కేంద్రాలను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందు వాహని నాయకులు నాగేశ్వర్, సత్యంలు పాల్గొన్నారు.

కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

మంచిర్యాలకలెక్టరేట్, మే27 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాంట్రాక్టు కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐటీయుటీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. మంగళవారం సూపరింటెండెంట్ పి. హరీశ్ చంద్రరెడ్డికి వినతిపత్రం అందజే శారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, మెడికల్ కాంట్రాక్టు కార్మికులు రాయమల్లు, నరసయ్య ఉన్నారు.

అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి



నీల్వాయి ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న కొయ్యల ఏమాజీ

వేమనపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామంలో నిరుపేద రైతులకు పట్టా పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ వారి భూములు అటవీ శాఖ భూములని అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఇది సరైంది కాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ పేర్కొన్నారు. సోమవారం రాత్రి అటవీ శాఖ అధికారులపై నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొయ్యల ఏమాజీ మాట్లాడుతూ చామనపల్లి గ్రామానికి చెందిన రైతు లకు గత ప్రభుత్వాలు పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చినప్పటికీ ఆ భూములు అటవీ శాఖ భూములంటూ రైతులను సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. 9 మంది దళిత రైతులపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని ఆరోపించారు. నిరుపేద దళిత రైతులను వేధిస్తున్న అటవీ శాఖ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పేద రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. గతంలో భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాల్లోని పోడు రైతుల పక్షాన పోరాటం చేసి అర్హులైన రైతులకు 200 ఎకరాల భూమిని ఇప్పించానని తెలిపారు. చామనపల్లి రైతుల కోసం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మున్నారాజాసిసోడియా, దుర్గం ఎల్లయ్య, బానయ్య, లింగయ్య, పర్వతాలు, మధుకర్, సతీష్, రాజయ్య, మల్లయ్య , కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

మందమర్రిలో జర్నలిస్టుల కొవ్వొత్తుల ర్యాలీ

మునీర్ మృతి పత్రికారంగానికి తీరని లోటు



మందమర్రిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

మందమర్రిటౌన్, మే27 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ మృతికి సంతాపంగా పట్టణంలో మంగళవారం రాత్రి ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లోని స్థానిక బీటీ అబ్రహం స్తూపం వద్ద నుంచి ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీ ఆయా మార్కెట్ సెంటర్ గుండా కోల్‌బెల్ట్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద వరకు సాగింది. అనంతరం మునీర్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు పెట్టి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ సంఘాల నాయ కులు మాట్లాడుతూ మునీర్ మృతి అటు పత్రికా రంగా నికి ప్రజలకు తీరని లోటన్నారు.

మందమర్రిలో దొరల దురహంకారాలకు భూస్వామి పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నాయకుడు మునీర్ అని కొనియాడారు. కోల్‌బెల్ట్ విద్యాభివృద్ధికి సింగరేణి పాఠశాలలు స్థాపించాలని ఆమరణ నిరహార దీక్ష చేసిన వ్యక్తి కూడ మునీర్ అని తెలిపారు. మందమర్రిలో లేదా మంచిర్యాల ఎక్కడో ఒక చోట విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సింగరేణి గనుల డిపార్ట్‌మెంట్ల వద్ద సంతాప కార్యక్రమాలు కార్మిక సంఘాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు, ఆయా సంఘాల నాయకులు హెచ్. రవీందర్, వెంకట్‌రావు, సారయ్య, శాంకరి, చందర్, సంజీవ్, సంజీవ్, ఓ. రాజశేఖర్, సొత్కు సుధాకర్, మేడిపల్లి సంపత్, సలేంద్ర సత్యనారాయణ, ఎస్. వెంకటస్వామి సొత్కు సుదర్శన్; సునిల్ మాదిగ, విజయ్‌కుమార్, సంగి సంతోష్, టి. శంకర్, మందమర్రి ప్రెస్‌క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.,

రోడ్డు..పట్టాలపై నడిచే వాహనం



బెల్లంపల్లి, మే27 (ఆంధ్రజ్యోతి): ఇదేంటి రైలు పట్టాలపై వ్యాన్ వెళ్తుందేంటి అనుకుంటున్నారా. అవును మీరు ఈ ఫొటోల్లో చూస్తున్నది వ్యానే ఇది రైలు పట్టాలపై నడవడంతో పాటు రహదారిపైకి చేరినప్పుడు టైర్లతో నడుస్తుంది. ఈ వ్యాన్‌ను ఇలా ఎందుకు నడిపిస్తున్నారో తెలుసుకుందాం..ఇటీవల మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 3వ రైల్వే ట్రాక్ పనులు రైల్వేశాఖ అధికారులు చేపడుతున్నారు. ఈ పనుల్లో భాగంగా నిర్మాణ సామగ్రి తరలించేందుకు ఇలా రోడ్డుపైన, రైలు పట్టాలపైనా నడిచే విధంగా వాహనం రూపొందించారు. రోడ్డుపై ప్రయాణిం చేందుకు టైర్లతో ఉన్న ఈ వాహనానికి, రైలు పట్టాలపై ప్రయాణించేందుకు ఐరన్ వీల్స్‌లు ఏర్పాటు చేశారు. రైలు పట్టాలపై పని ఉన్న సమయంలో అధికారులు రైలు వీల్స్‌ను ఉపయోగిస్తున్నారు. మళ్లీ రహదారిపై వచ్చిన క్రమంలో టైర్లను ఉపయోగిస్తూ పనులు చేపడుతున్నారు. ఈ వ్యాన్‌లో 3వ రైల్వే పనులకు సంబంధించిన వివిధ పని ముట్లతో పాటు డీజిల్, జనరేటర్, ఇతర సామగ్రి అందుబాటులో ఉన్నాయి. ఇలా రైలు పట్టాలపై వ్యాన్ వెళ్తుండడం చూసి ప్రజ లు ఫొటోలు తీసుకుంటూ ఆసక్తి కనబరుస్తున్నారు.



30న జాబ్‌మేళా

ఆసిఫాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే దిశగా ఈ నెల 30న జిల్లా కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి రవికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయ బయో ఫెర్టిలైజర్‌లో 25 ఖాళీలు, పేటీఎంలో 50 ఖాళీల భర్తీకి పాత కలెక్టరేట్‌లో గల టాస్క్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పేటీ ఎంకు పదో తరగతి ఆ పై చదివిన వారు అర్హులని తెలిపారు. విజయ బయోఫెర్టిలైజర్‌కు బీఎస్సీ అగ్రికల్చర్ చదివి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9440514962, 9502786438 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి రవికృష్ణ సూచించారు.

రాజ్‌గోండ్ ఉద్యోగుల మండల కార్యవర్గం

సిర్పూర్(యు), మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాగాం రాయిసెంటర్‌లో మంగళవారం రాజ్‌గోండ్ ఉద్యోగుల సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సిర్పూర్(యు) మండల అధ్యక్షుడిగా గెడం జగ్జీవన్,ప్రధాన కార్యదర్శిగా ఉర్వేత మోహన్, ఉపాధ్యక్షులుగా జైవంత్‌రావు, ఆత్రం బాదిరావు, గెడం లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీగా కోట్నాక పాండురంగ్‌నుతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. లింగాపూర్ అధ్యక్షుడిగా ఆత్రం చొక్కారావు, ప్రధాన కార్యదర్శిగా కుమ్ర దేవ్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా కనక బుచ్చిరాంతోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కనక రామారావు, పర్యావేక్షులుగా ఆత్రం ఆనంద్‌రావు, అనక దేవేందర్, కోట్నాక మొహత్‌రావు,మెస్రం మోతిరాం, కోవ నాగోరావు తదితరులు వ్యవహరించారు.

ఉపాధి కూలీలకూ ముఖగుర్తింపు

- వేతనాల చెల్లింపులో పారదర్శకత
- బోగస్ నమోదును అరికట్టేందుకు చర్యలు
- క్షేత్రసహాయకులకు శిక్షణ
- జిల్లాలో 2,44,312 మంది కూలీలు

కూలీలను సెల్‌ఫోన్‌లో ఫొటో తీస్తున్న క్షేత్రసహాయకుడు



ఉపాధి హామీ పథకంలో బోగస్ కూలీల నమోదును అరికంట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ తాజాగా కూలీల ముఖగుర్తింపు ప్రకియ చేపట్టింది.

వాంకిడి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం వేతనాల చెల్లింపులో అక్రమాలు చోటుచేసుకుంటు న్నాయని గుర్తించిన గ్రామీణాభివృద్ధి శాఖ తాజాగా కూలీల ముఖ గుర్తింపు ప్రక్రియ చేపట్టింది. ఏప్రిల్ 1 నుంచి కూలీలకు వేతనాలు చేతికందాలంటే ముఖ హాజరు తప్పనిసరి చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 335 గ్రామ పంచాయతీల పరిధిలో పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రసహాయకులు ఫొటోలు తీసే ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలో 1,23,505 జాబ్ కార్డులు ఉన్నాయి. 2,44,312 మంది కూలీలు ఉన్నారు.

పారదర్శకత లోపించడంతో..

ఇన్నాళ్లు వేతనాల చెల్లింపులో పారదర్శకత లోపించడంతో పనిచేసిన కూలీలకన్నా అధికంగా డబ్బులు చెల్లించారు. ఏప్రిల్ 1కి ముందు మస్టర్లలో ఎంత మంది పేర్లు నమోదు చేస్తే అంత మందికి డబ్బులు చెల్లించారు. కేవలం మస్టర్లలో ఎంత మంది పేర్లు నమోదు చేస్తే అంత మందికి డబ్బులు చెల్లించారు. కేవలం మస్టర్లను ప్రామాణికంగా తీసుకొని వేతనాల చెల్లింపుల ప్రక్రియ చేపట్టారు. చాలా గ్రామాల్లో పనిచేసిన కూలీలకన్నా ఎక్కువ మందిని నమోదు చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పనితక్కువ చెల్లింపులు ఎక్కువగా చేసినట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం వేతనాన్ని రూ. 307కు పెంచడంతో చెల్లింపుల ప్రక్రియను మరింత కట్టుదిట్టం చేయడానికి చర్యలు చేపట్టింది.

యాప్‌లో నమోదు..

కూలీల ముఖగుర్తింపు కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఎన్ఎంఎంఎస్ మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది. యాప్ వినియోగంపై జిల్లా లోని క్షేత్రసహాయకులకు శిక్షణ ఇచ్చా రు. సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లో కోడ్ నమోదు చేస్తే ఓపెన్ అవుతుంది. ఓపెన్ కాగానే పనిచేస్తున్న ప్రాంతానికి సంబంధించన అక్షాంశాలు, రేఖాంశాలు అందులో నమోదవుతాయి. యాప్‌లోనే కెమెరా ఎంపిక ఉంటుంది. కెమెరాను తెరిచి ఒక్కో కూలీ ముఖాన్ని సెల్‌ఫోన్‌లో ఫొటో తీయాలి. దీంతో పాటు మస్టర్లలో పేర్లను నమోదు చేయాలి. యాప్‌లో నమోదు కాకపోతే డబ్బులు రావు. యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్త కుండా చూస్తున్నారు.

ముఖగుర్తింపు తప్పనిసరి
- శ్రావణ్‌కుమార్, ఏపీవో, వాంకిడి



వేతనాల చెల్లింపులో పారదర్శకత ఉండేలా రోజు వారి పనిచేసిన కూలీల ముఖ గుర్తింపు తప్పనిసరిగా తీస్తున్నాం. దీనిపై క్షేత్రసహాయకులకు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న అన్ని చోట్ల కూలీలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం.

రమాబాయి ఆశయాలు ఆదర్శనీయం



నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

వాంకిడి, మే 27 (ఆంధ్రజ్యోతి): రమాబాయి అంబేద్కర్ ఆశయాలు ఆదర్శనీయమని బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహల్కర్ అన్నారు. స్థానిక జేత్వాన్ బుద్ధ విహార్‌లో మంగళవారం అంబేద్కర్ సతీమణి రమాబాయి వర్ధంతిని పురస్కరించుకుని పలువురు ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహల్కర్, సీనియర్ బౌద్ధ ఉపాసకుడు జయరాం మాట్లాడుతూ రమాబాయి నేటి మహిళా లోకానికి ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్, సందీప్, విజయ్, ప్రశాంత్, రోషన్, శ్యాంరావు, రాజేంద్రప్రసాద్, రమేష్, శివాజీ, పాండు, జైపాల్, దీపక్, కమలా బాయి, నాగసేన్, యోగేందర్, నూతన్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల బియ్యం అందజేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజ్ అలీ

వాంకిడి, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాలను సారం వర్షాకాలం నేపథ్యంలో మూడు నెలల బియ్యం లబ్ధిదారులకు అందజేయాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం డీలర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. రేషన్ దుకాణాలు జూన్ 1 నుంచి 30 వరకు తెరిచి ఉండాలన్నారు. గ్రామాల్లో మూడు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ జరుగుతుందని దండోరా ద్వారా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడు మూడు నెలల రేషన్ సరుకులను రేషన్ డీలర్ల నుంచి తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో డీటీ శ్రావణ్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పోచయ్య

ఆసిఫాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పోచయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రోహిత్ దేశ్‌పాండే మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో ఆసిఫాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పోచయ్యను నియమిస్తూ కలెక్టర్ వెంకటేష్ దోత్రే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, పాల్గొన్న నాయకులు

కాగజ్‌నగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తనపై చేసిన ఆరోపణలు సరికాదని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల క్రితం చింతలమానేపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తనపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నానని అన్నారు. గతంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కటింగ్ పేరిట కోత విధించినా ఆయన పట్టించుకోలేదని చెప్పారు. ప్రాణహిత ప్రాజెక్టు ఇక్కడి నుంచి తరలిపోతుంటే కోనప్ప ఏం చేశారని హరీష్‌బాబు ప్రశ్నించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే చేసిన అవినీతికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. బుధవారం తుమ్మిడి హెట్టి వద్దకు తాను వస్తానని, అక్కడికి ఆయన వస్తే బహిరంగంగా నిరూపిస్తామని తెలిపారు. ఎంపి ఎన్నికల సందర్భంగా పార్టీ నుంచి నిధులు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్ కాజేశారని హరీశ్ బాబు ఆరోపించారు. తన హయంలో రైతులకు కటింగ్ లేకుండా నేరుగా అమ్ముకునే విధంగా వెసులు బాటు కల్పిస్తున్నామని చెప్పా రు. నియోజకవర్గ సమస్యలు దశల వారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివ, జిల్లా కోశాధికారి అరుణ్ లోయా,అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రచారి, మాజీ జడ్పీటీసీ నీరెటి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మనోహర్‌గౌడ్, పిర్సింగుల తిరుపతి, కుమారస్వామి, తిరుపతి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ఆరోపణలు వాస్తవం కాదు'

కాగజ్‌నగర్‌టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఎంపీ ఎన్నికల సందర్భంగా వచ్చిన పార్టీ నిధులను తాను, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాజేశారని చేసిన ఆరోపణలు వాస్తవం కాదని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ నుంచి రావి శ్రీనివాస్ ఫోన్‌లో మాట్లాడుతూ తనపై అసత్య ఆరోపణలు చేస్తే కార్యకర్తలు ఊరుకోరని చెప్పారు. ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదని రావి శ్రీనివాస్ తెలిపారు.

నెహ్రూకు ఘన నివాళి

వాంకిడి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు సురేందర్, యుగంత్, దీపక్, రాశాద్, సునీల్, విజయ్, లడ్డు, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

'చలో కలెక్టరేట్'కు తరలిరావాలి



మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్

రెబ్బెన, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చూస్తూ ఈ నెల 30న ఆసిఫాబాద్‌లో నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని తెలంగాణ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కోరారు. రాంపూర్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు రేటు పెంచాలని, పని దినాలు పెంచాలని, ఉపాధి హామీ పని వద్ద వసతులు కల్పించాలని డిమాండు చేశారు. సమస్యల పరిష్కారానికి చేపట్టే కార్యక్రమానికి కూలీలు పెద్ద సంఖ్యలో హాజరు కోవాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం, చాపిడి శ్రావణి పాల్గొన్నారు.

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

వాంకిడి, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హెచ్‌ఈవో రవిదాస్ సూచించారు.మండలంలోని గణేష్‌పూర్, సోనాపూర్ గ్రామల్లో మంగళవారం ఇంటింటికి వెళ్లి పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించా రు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రజ లు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి విద్యశ్రీ, భగవాన్‌దాస్, సునంద తదితరులు పాల్గొన్నారు.

'దుండగులపై చర్యలు తీసుకోవాలి'

సిర్పూర్(టి), మే 27(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముథోల్ నియోజక వర్గంలో బుద్ధుడి విగ్రహం తొలగించిన దుండగులపై చర్యలు తీసుకోవాలని బుద్ధుడి విగ్రహా కమిటీ తాలూకా అధ్యక్షుడు దుర్గం విక్రంతో పాటు కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానికంగా మంగళవారం వారు మాట్లాడారు. అదే స్థలంలో బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, వసంత్‌రావు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ట్రైబల్ మోడల్ స్పోర్ట్స్ పాఠశాల క్రీడా మైదానంలో ట్రాక్, ఫీల్డ్‌లో జిల్లా స్థాయి అండర్ -8, 10, 12 అట్టహాసంగా ప్రారంభమ్యాయి. ఈ పోటీలకు 50 మంది బాలబాలికలు ఎంపిక చేశారు. ప్రతిభ చాటిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారు జూన్ 1వ తేదీన హైదరాబాద్‌లోని జింఖానా క్రీడా మైదానంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ తెలిపారు. కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్, కోచ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

గతంలో పని చేసిన సీఆర్టీని నియమించాలి

సిర్పూర్(యు), మే27 (ఆంధ్రజ్యోతి): గతంలో బాండేయేర్ గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో విధులు నిర్వహించిన సీఆర్టీ ఆత్రం భీంరావును తిరిగి నియమించాలి వీటీడీఏ మండల చైర్మన్ కుమ్ర భీంరావు ఐటీడీఏ పీవో కుష్బూగుప్తకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. బాండేయేర్ పాఠశాలలో 75 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన విద్యని అందించడానికి సీఆర్టీ ఆత్రం భీంరావుని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని పీవోను కోరారు.

మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులకు సన్మానం

కాగజ్‌నగర్, మే 27 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులను తాలుకూ మున్నూరుకాపుసంఘం కార్యవర్గ సభ్యులను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గజ్జి రామయ్య, పెద్దపల్లి కిషన్ రావు, తాటి రాంచందర్, పుప్పాల సత్యనారాయణ, తాలుకా అధ్యక్షుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కంబారిలో ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఆదివాసీ కోలావార్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య

కౌటాల, మే 27 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం కంబారి గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతలకు ఆదివాసీ కోలా వార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్స పోచయ్య ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు డబ్బా బాపు, రాజు, చిలుకయ్య, సురేష్, సత్తయ్య, అశోక్, హనుమంతు, సత్తన్న, నాగేష్, మహేష్, కార్తీక్, శంకర్, పణిందర్, ఇస్తారి, రవి, అంజన్న, మల్లేష్, సురేష్, నాగయ్య, శంకర్, అంజన్న, భిక్షపతి, లక్ష్మి, రామయ్య, నానాజీ, రాజక్క, సుశీల, లక్ష్మి, విమల, తారా, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల నిరసన



నిరసన తెలియజేస్తున్న గ్రామస్థులు

ఆసిఫాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పల్‌నౌగాం గ్రామస్థులు మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి జాతీయ మాన వ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో దశాబ్దాలుగా ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్నామని చెప్పారు. ఇటీవల కొంత మంది తమను గ్రామాన్ని ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బురదలో కూరుకుపోతున్న వాహనాలు

సిర్పూర్(టి), మే 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల రోడ్లు బురదమయంగా మారడంతో వాహనదారులు బురదతో కూరుకుపోతున్నా యి. మండలంలోని శివాపూర్, వెంకట్రావుపేట, మాకిడి, హుడ్కిలి అంతర్గత రోడ్డు తొలకరి వర్షాలకే బురదగా మారి ఈ రహదారులపై నిత్యం నడిచే వాహనాలు బురదలో కూరుకుపోతు న్నాయి. దీంతో గ్రామస్థులకు, ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మట్టి రోడ్డులో వర్షాకాలం పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు వర్షానికి బురద అయిన రోడ్లపై కనీసం మొరం, మట్టి, కంకర సైతం వేయడం లేదు. సిర్పూర్(టి) ప్రధాన రహదారి అయినా రైల్వే స్టేషన్ రోడ్డు బురదగా మారినా అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బురదలో కూరుకుపోయిన లారీ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చింతలమానేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఏనుగుల సంచారం ఉందన్న విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్జెల్లి రేంజ్ ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో ఎక్బాల్ అన్నారు. గతంలో చింతలమానేపల్లి మండలం బూరెపల్లి, పెంచికలపేట మండలం కొండపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగు హతమర్చిన విషయం తెలిసిందే. ఏనుగును తిరిగి మహారాష్ట్రకు పంపించేందుకు జిల్లా అధికారులు తీవ్ర ప్రయత్నాలు సాగించారు. జిల్లా అటవీ శాఖాధి కారులు మహారాష్ట్ర అధికారులను సంప్రదించి సమాచారం తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

నిధులు రాక ఇబ్బందులు

దహెగాం, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు నిధులు రాక ఇబ్బందులు పడుతున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో ఆల్బర్ట్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడు తూ 15 నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కావడం లేదని ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దీక్షను విజయవంతం చేయాలి

పెంచికలపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆదిమ గిరిజన భూ రక్షణ కమిటీ రాజ్ గోండ్ సేవా సమితి గోండ్వానా పంచాయతీ రాజ్ సెంటర్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న దీక్షను విజయవంతం చేయాలని పంచాయతీ రాజ్ సెంటర్ మండల సర్‌మేడి ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, అంగన్‌వాడీ భవనాలు, రోడ్లు నిర్మించేందుకు అనుమతులు ఇవ్వాలని దీక్ష చేపట్టనున్నామని తెలిపారు.